మన సమగ్ర
# ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM

తెలుగు డైలీ

గురువారం , ఆగస్టు 20, 2026

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY


https://epaper.prajavaani.net

### పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే
## క్రమశిక్షణ చర్యలు



**హైదరాబాద్ :** పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించిన ఆయన.. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డి ఆవేదనను అర్థం చేసుకున్నామని, టికెట్లపై నిర్ణయం ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ తీసుకుంటాయని చెప్పారు. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. 22ఏ అంశంపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. కిందిస్థాయిలో తప్పిదాలను సరిదిద్దాలని సీఎం అధికారులను ఆదేశించారని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ..
## పొంగులేటిని మంత్రివర్గం నుంచి
# బర్తరఫ్ చేయాలని డిమాండ్





**హైదరాబాద్ :** తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో బహిరంగం గా దందాలు, వేధింపులు సాగుతు న్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండి పడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైద రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు.రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు.

### ‘శుద్ధీకరణ’ ఘటనపై ఖర్గే ఆవేదన..
## పార్టీ నేతల మౌనంపై అసంతృప్తి

- హల్ద్వానీ శుద్ధీకరణ ఘటనపై సీడబ్ల్యూసీలో ఖర్గే ఆవేదన
- తనకు పార్టీ నేతల నుంచి తగిన మద్దతు రాలేదని అసంతృప్తి
- సభా వేదిక శుద్ధీకరణ తనను అవమానించిందని రాజ్యసభలో ఆవేదన
- బాధ్యులపై అంటరానితనం నిరోధక చట్టం కింద చర్య తీసుకోవాలని విన్నపం



**ఉత్తరాఖండ్:** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తన సభ జరిగిన ప్రదేశాన్ని శుద్ధి చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లోని పలువురు నేతలు బహిరంగంగా స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ ఎన్డీటీవీ వెల్లడించింది.ఆగస్టు 8న హల్ద్వానీలోని రామ్ లీలా మైదానంలో ఖర్గే ‘విజయ్ శంఖనాద’ సభ లో పాల్గొన్నారు. రెండు రోజుల తర్వాత ఆగస్టు 10న ‘శ్రీరామ్ సేన’కు చెందిన కార్యకర్తలు అక్కడ శుద్ధి హోమం నిర్వహించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించిన ట్లు సమాచారం. ఘటన జరిగిన తర్వాత పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు తనకు బహిరం గంగా మద్దతు ఇవ్వలేదని ఆయన బాధపడ్డారని పార్టీ వర్గాలు తెలిపాయి.అయితే ఖర్గే ఎవరినీ ప్రత్యేకంగా పేరుపెట్టి విమర్శించలేదని సమాచారం. కొందరు సీనియర్ నేతలు ఈ ఘటనపై గట్టిగా స్పందించకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు సమావేశంలో వ్యవహరించిన తీరును బట్టి తెలుస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

### డీఎస్సీ అక్రమాలపై సీబీఐ
## విచారణ జరిపించాల్సిందే



**అమరావతి:** రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో స్పష్టమైన అక్రమాలు, అవకతవకలు జరిగిన ఆధారాలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఒప్పుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శిం చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఏపీ డీఎస్సీ నియామక చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రశ్నాపత్రం తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే అధికారి చేతిలో పెట్టారని జగన్ విమర్శించారు. స్వయంగా మంత్రి నారా లోకేశ్ సభలో ఈ విషయాన్ని అంగీకరించారని, ఇలా రెండూ ఒకే వ్యక్తికి అప్పగించడమే లీకేజీలకు, డీఎస్సీ స్కామ్‌కు బీజం వేసిందని ఆరోపి ంచారు. దీనిపై పారదర్శకత కోసం సీబీఐ విచారణ జరిపించా ల్సిందేనని అన్నారు.ప్రశ్నాపత్రాల తయారీ విభాగంలో పనిచేసిన నవీన్ అనే వ్యక్తికి డీఎస్సీలో మొదటి ర్యాంక్ రావడంపై జగన్ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం మొదట నవీన్‌కు ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని అంగీకరించి, ఆ తర్వాత సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు హాజరుకాలేదనే నెపంతో రెండో జాబితా నుంచి అతని పేరును తొలగించిందని విమర్శించారు.

### క్రమశిక్షణ కమిటీకి లేఖ రాయనున్న
## కొండా సురేఖ
### కూతురిని సమర్థిస్తారా?



**హైదరాబాద్, ఆగస్టు 20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాయనున్నారు. (గురువారం) సాయంత్రం లేఖ ద్వారా వివరణ ఇవ్వనున్నారు. (బుధవారం) సీఎం రేవంత్ రెడ్డిపై సుస్మిత.. తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న క్రమశిక్షణ కమిటీ.. కొండా సుస్మిత పటేల్‌కు కాంగ్రెస్ సభ్య త్వం లేకపోవడంతో సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గతంలోనూ సీఎంపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేయగా.. కూతురి తరఫున సీఎంకు కొండా సురేఖ క్షమాపణ చెప్పిన సంగతి విది తమే. ఈ నేపథ్య ంలో తాజా వ్యాఖ్యలపై.. క్రమ శిక్షణ కమిటీకి ఇచ్చే వివరణలో మంత్రి ఎలాంటి అంశాలను ప్రస్తావిస్తారన్న దానిపై నెలకొన్న ఉత్కంఠ నెలకొంది. కూతురి వాఖ్యలను సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా అనేది తెలియాల్సి ఉంది. లేదంటే కూతురు చేసిన వాఖ్యలను ప్రస్తావించకుండా పరకాల అంశాన్ని లేవనెత్తుతారా అనే సస్పెన్స్ కొనసాగుతోంది.

### రెండో విడత ఇందిరమ్మ ఇళ్లపై
# బిగ్ అప్డేట్



**హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత లబ్ధిదా రులను సెప్టెంబరు 15 నాటికి ఎంపిక చేసి, మంజూరు పత్రాలు అందించేలా హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్య ంగా పెట్టుకుంది. క్యూర్ పరిధి మినహా యించి రాష్ట్రంలోని 100 నియోజ కవర్గాల్లో ఒక్కో నియోజ కవర్గానికి 2,500 చొప్పున ఇళ్లను నిర్మించి ఇవ్వనుంది. తెలంగాణలో 50 వేల మంది వరకు గుడిసెల్లో నివసిస్తున్నట్లు అధికారుల సర్వేలో తేలింది. రెండో విడతలో వీరందరికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే ‘రూఫ్? పునఃప్రారంభం’ అనే కొత్త పథకం పేరుతో నియోజ కవర్గానికి 700 చొప్పున 70 వేల ఇళ్లు మంజూరు చేయనున్నా రు.ఈసారి మొదడి విడతలోనే రూ.లక్ష రుణం : మహిళా సంఘాల ద్వారా రూ.లక్షలను నాలుగు దశలో ఇవ్వనుం ది. పునాది దశ దాటిన తర్వాత మొదటి విడత రూ.లక్షను అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో భాగంగా చాలామంది పేదలు పునాది వరకు ఇళ్లను నిర్మించుకోవడంలో ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు రూ.లక్ష రుణం ముందే ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇందిరమ్మ అర్హుల జాబితా ప్రకటన : మరోవైపు హైదరాబాద్ కోర్ అర్బన్? పరిధిలో ఇందిరమ్మ ఇళ్లను ఈనెల 27 నుంచి కేటాయించనున్నారు. 27 నుంచి 31 వరకు రోజుకు 4 నియోజక వర్గాల్లో పూర్తి పారదర్శకంగా లాటరీ నిర్వహిం చనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు.

### డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై
# పోలీసుల స్పెషల్ నజర్



**హైదరాబాద్:** నేర స్వభావానికి అనుగుణంగా పోలీస్ శాఖలో భారీ పునర్ వ్యవస్థీకరణ జరిగిం ది. డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, రోడ్డు భద్రత వంటి సవాళ్లపై పోలీస్ బలగాలు మరింత దృష్టి సారించనున్నాయి. గ్రే హౌండ్స్, ఆక్టోపస్, ఎస్?ఐబీ తదితర విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించారు. ఇందులో అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించడం ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి : ఒకప్పుడు రాష్ట్రంలో పోలీసులకు వామపక్ష తీవ్రవాదం, ఆ తర్వాత ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండేవి. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు గ్రే హౌండ్స్, ఎస్ఐబీ, ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు కీలకంగా పని చేశాయి. అయితే కాలంతో పాటు నేరాల స్వభావం మారింది. డ్రగ్స్, సైబర్ నేరాలు, కొత్త సవాళ్లుగా మారాయి. లను అవసరాలకు అనుగుణంగా మళ్లించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా 513 మందిని 8 విభాగాలకు కేటాయించారు. రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటా చ్‌మెంట్‌పై పని చేయించిన తర్వాత విద్యా ర్హతలు, అనుభవం, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని తుది పోస్టింగ్‌లు ఇచ్చారు.

# 37 రోజుల్లో రూ.87.20 లక్షల హుండీ ఆదాయం





**మన ప్రజావాణి చౌడేపల్లి: ఆగష్టు 20** ప్రముఖ శక్తి క్షేత్రం, కోరిన కోర్కెలు తీర్చే కల్వవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 37 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా నగదు రూపంలో రూ.87,20,769 సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. బంగారం 23.005 గ్రాములు, వెండి 250.012 గ్రాములు లభించినట్లు పేర్కొన్నారు.విదేశీ కరెన్సీలో టాంజానియా షిల్లింగ్స్, కువైట్, కెనడా, ఒమన్, సౌదీ అరేబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చెందిన నోట్లు లభించాయి. అన్నదానం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.12,873, శ్రీ రణభేరి గంగమ్మ దేవస్థానం హుండీ ద్వారా రూ.65,851 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.హుండీ లెక్కింపు ప్రక్రియను దేవస్థాన ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి జె. ఏకాంబరం పర్యవేక్షించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. శశికుమార్, చౌడేపల్లిపోలీసుసిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులో దొంగతనం.





**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంతని మండలశీ చిల్లపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీను అనే వ్యక్తి చిల్లపల్లెకు దుబ్బ పల్లె కు మధ్యలో చిన్నగా షాప్ ఏర్పాటు చేసుకొని నడిపించుకుంటూ దానిలో సిగరెట్లు గుట్కాలు మందు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి దాని తాళాలు పగలగొట్టి మందు ఒక 15,000 విలువగల సిగరెట్ డబ్బాలు 2000 రూపాయల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలియజేస్తున్నాడు

# విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన






**తిరుపతి, ఆగస్టు 20:** తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు తిరుపతి రామచంద్ర నగర్‌లోని చైతన్య టెక్నో స్కూల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాదచారుల భద్రత, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలపై అవగాహన కల్పించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.అదేవిధంగా పాదచారులు రహదారి దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్‌ను మాత్రమే వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించాలని విద్యార్థులకు వివరించారు. తాము రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. సంజీవకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించుకుని, సురక్షితమైన రహదారి ప్రయాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు.

# జేఎన్టీయూ స్పాట్ అడ్మిషన్ల సందడి.. నేడు, రేపు కూడా కౌన్సెలింగ్

**హైదరాబాద్ :** ఈఏపీసెట్ తర్వాత జేఎన్టీయూలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ హాట్ కేకుల్లా వేగంగా భర్తీ అవుతున్న ఇంజినీరింగ్ సీట్లు జేఎన్టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో సీట్లన్నీ పూర్తి నేడు, రేపు పలు కాలేజీలకు కొనసాగనున్న స్పాట్ కౌన్సెలింగ్ ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపుఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, జేఎన్టీయూ పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో ఈ సీట్లు వేగంగా భర్తీ అవుతున్నాయి.బుధవారం హైదరాబాద్‌లోని యూనివర్సిటీ అడ్మిషన్ల కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. దీంతో క్యాంపస్ ప్రాంగణమంతా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా మారింది.కౌన్సెలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే జేఎన్టీయూ హైదరాబాద్‌లోని 26 సీట్లు, సుల్తాన్‌పూర్‌లోని 8 సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. ఇక జగిత్యాల కళాశాలలోని రెండు సీట్లలో ఒకటి భర్తీ అయింది. సీట్లు శరవేగంగా భర్తీ అవుతున్నాయని అడ్మిషన్ల డైరెక్టర్ బాలునాయక్ వెల్లడించారు.ఈ ప్రక్రియలో భాగంగా నేడు (గురువారం) మంథని, సిరిసిల్ల, పాలేరు కళాశాలలకు స్పాట్ కౌన్సెలింగ్



నిర్వహించనున్నారు. రేపు (శుక్రవారం) వనపర్తి, కోస్గి, మహబూబాబాద్ కళాశాలలకు అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. ఈ కౌన్సెలింగ్ మొత్తం హైదరాబాద్ క్యాంపస్‌లోనే జరుగుతుందని అధికారులు తెలిపారు.సీట్ల కేటాయింపును ఈఏపీసెట్ ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరీ మరియు ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ ఆధారంగా చేపడుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత వచ్చిన అభ్యర్థులకు 'ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత' ప్రాతిపదికన అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, అవసరమైన ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు.


# రైతులకు 'నానో'తో లాభాలెన్నో - తక్కువ ధరతో ఎక్కువ దిగుబడి



**హైదరాబాద్ :** రైతులు యూరియా సరఫరాల కోసం ఎదురుచూస్తుండగా, ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ ఆధారిత పంపిణీ వ్యవస్థ కొన్ని ఇబ్బందులను కలిగిస్తోంది. ఇప్పుడు బుకింగ్ విధానం అమల్లోకి రావడంతో, స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ సదుపాయం లేదా సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సంప్రదాయకంగా యూరియా 45 కేజీల ఘన సంచుల్లో లభిస్తుంది, దీని గరిష్ఠ ధర సుమారుగా రూ.266.65 ఉంటుంది. రైతులు పంట అవసరం మేరకు నేలకు అందిస్తారు.గ్రాన్యులర్ యూరియాను నేలకు వేసినప్పుడు, నీటి ప్రవాహం ద్వారా నత్రజని నష్టపోయే ప్రమాదం ఉంది. అది భూగర్భ జలాల్లోకి చేరి వాటిని కలుషితం చేయగలదు. దీనికి ప్రత్యామ్నాయంగా ద్రవరూప నానో యూరియా చిన్న సీసాలలో లభిస్తుంది. దీనిని పంట ఆకులపై పిచికారీ చేయడం ద్వారా వాడతారు. వ్యవసాయ అధికారులు ఎకరానికి ఒక్కో పిచికారీకి 250--500 మిల్లీలీటర్ల మోతాదును సిఫార్సు చేస్తున్నారు. 500 మిల్లీలీటర్ల సీసా ధర సుమారు రూ.225. నానో యూరియా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీనిని వ్యవసాయ అధికారులు అందించిన మార్గదర్శకాల ప్రకారం వాడాలి.నానో యూరియా వినియోగంపై మేం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముందస్తు బుకింగ్ అవసరం లేకుండా నానోను నేరుగా కొనుగోలు చేయవచ్చు. ఇది ఖర్చులను తగ్గిస్తుంది. రవాణా భారాన్ని తొలగిస్తుంది - వెంకటరమణ రెడ్డి, నల్గొండ డీఏవోబుకింగ్ అవసరం లేదు, ఇబ్బందులు లేవు : సంప్రదాయ యూరియా ఘన సంచులలో వస్తుంది. దీని రవాణా, నిల్వకు గణనీయమైన స్థలం అవసరం. తరచుగా అనేకసార్లు బుకింగ్ చేయవలసి ఉంటుంది. దీనికి విరుద్ధంగా, 'నానో' ద్రవ రూపంలో లభిస్తుంది. దీనివల్ల తక్కువ పరిమాణంలో రవాణా చేయడం సులభం. మొక్క ఆకుల ద్వారా నత్రజనిని అందించడం ద్వారా వినియోగ సామర్థ్యాన్ని పెంచడమే దీని ప్రాథమిక లక్ష్యం. 'నానో'లోని కణాలు 20 నుంచి 50 నానోమీటర్ల పరిమాణంలో ఉంటాయి. సంప్రదాయ యూరియా కణాలతో పోలిస్తే చాలా పెద్ద ఉపరితల విస్తీర్ణం ఉంటుందని భారత రైతుల ఎరువుల సహకార

# వర్సిటీ యూనిట్‌గా అధ్యాపకుల నియామకాలు - తొలి విడతగా 1,500 పోస్టుల భర్తీ

**అమరావతి:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు రిజర్వేషన్ నిబంధనలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ రిజర్వేషన్ ఇన్ టీచర్స్ క్యాడర్ బిల్-2026ను మంత్రి లోకేశ్ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. యూనివర్సిటీల్లో భారీగా అధ్యాపక పోస్టులు ఖాళీలున్నట్లు మంత్రి చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో తొలి విడతగా 15 వందల అధ్యాపక పోస్టులు భర్తీ చేసే నిర్దేశించినట్లు వివరించారు.రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అధ్యాపక నియామకాల్లో రిజర్వేషన్, యూజీసీ మార్గదర్శకాలు, గత నియామకాలకు సంబంధించి న్యాయపరమైన వివాదాలను దృష్టిలో పెట్టుకుని కొత్త సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ రిజర్వేషన్ ఇన్ టీచర్స్ క్యాడర్ బిల్-2026ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. సవరణల్లో భాగంగా విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా పరిగణిస్తూ నియామకాల నిర్వ హణ, అవసరమైనప్పుడు ఉన్న ఫ్యాకల్టీని అడ్జస్ట్ చేసేందుకు ప్రత్యేక విధానం తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.వర్టికల్, హారిజం టల్ విధానాలు రెండింటినీ సమన్వయంతో అమలు చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టు కుని చట్టపరమైన స్పష్టత తీసుకొస్తున్నట్లు మం త్రి లోకేశ్ చెప్పారు. అధ్యాపక ఖాళీల భర్తీ, రిజర్వేషన్‌కు న్యాయం, నాణ్యమైన ఉన్నత విద్య ఈ 3 లక్ష్యాలను కలిపేలా, కొత్త నియామక వ్యవస్థను ఏర్పాటు చేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని వివరించారు."రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీల్లో చాలా కాలంగా భారీగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనివల్ల ఉన్నత విద్య నాణ్యత దెబ్బతింటోంది. అందుకే మా ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో తొలి విడత కింద 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయిం చాం.గతంలో జరిగిన నియామకాల వల్ల అనేక న్యాయపరమైన వివాదాలు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, యూజీసీ నిబంధనలకు లోబడి కొత్త సవరణలు తీసుకొస్తున్నాం. ఇకపై ప్రతి వి న్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తూ



నియామకాలు చేపడతాం. అవసరమైనప్పుడు ఫ్యాకల్టీని అడ్జస్ట్ చేసేందుకు ఒక ప్రత్యేక విధానాన్ని కూడా తెస్తున్నాం" - లోకేశ్, మంత్రివర్సిటీల్లో రిజర్వేషన్ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో రిజర్వేషన్ల విధానాన్ని మరింత పటిష్ఠం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర విద్యా సంస్థల చట్టం-2019 మార్గదర్శకాలకు అనుగుణంగా గతంలో తెచ్చిన 'రాష్ట్ర విద్యా సంస్థల చట్టం-2021'కి కొన్ని స్వల్ప మార్పులు చేస్తూ ప్రభుత్వం సవరణ బిల్లును తీసుకువచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టారు.ప్రత్యక్ష నియామకాల భర్తీలో విశ్వవిద్యాలయాన్నే ఒక యూనిట్‌గా కొనసాగిస్తారు. దీనివల్ల అన్ని విభాగాల్లోనూ రిజర్వేషన్ల ప్రాతినిధ్యం స్పష్టంగా అమలు అవుతుంది. ఏదైనా విభాగంలో కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగా ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకులను సర్దుబాటు చేయడం వీలుకాకపోతే, వారికి తగిన పోస్టు వచ్చే వరకు 'సూపర్‌న్యూమరరీ' (తాత్కాలిక అదనపు పోస్టు) కింద చూపుతారు. వర్సిటీ పోస్టుల భర్తీ కోసం 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌పై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ విచారణ సమయంలో న్యాయస్థానం వ్యక్తం చేసిన సందేహాలు, లేవనెత్తిన సాంకేతిక అంశాలను క్లియర్ చేస్తూ, భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం ఈ మార్పులు చేపట్టింది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com